సాక్షి
శ్రీసత్యసాయి జిల్లా

గురువారం । 6 । మార్చి । 2025




టన్ను చీనీ రూ.25 వేలు

అనంతపురం మార్కెట్‌యార్డులో బుధవారం టన్ను చీనీకాయలు గరిష్టంగా రూ.25 వేలు, కనిష్టంగా రూ.8 వేల ప్రకారం ధర పలికాయి.



కిలో టమాట రూ.8

కక్కలపల్లి మండీలో బుధవారం కిలో టమాట గరిష్టంగా రూ.8 కనిష్టంగా రూ.5 ప్రకారం ధర పలికింది. మార్కెట్‌కు 270 టన్నుల టమాట అమ్మకానికి వచ్చింది.



న్యూస్‌రీల్

8న జాతీయ లోక్‌అదాలత్

- అదాలత్ తీర్పు 'సుప్రీం'
- ఉమ్మడి జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి. శ్రీనివాస్



మాట్లాడుతున్న ఉమ్మడి జిల్లా జడ్జి జి.శ్రీనివాస్

అనంతపురం: ఉమ్మడి జిల్లాలో మార్చి 8వ తేదీన జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఉమ్మడి జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి. శ్రీనివాస్ పేర్కొన్నారు. జిల్లా కోర్టు ప్రాంగణంలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. జాతీయ లోక్ అదాలత్‌లో ఇచ్చే తీర్పులు సుప్రీం కోర్టు తీర్పుతో సమానమన్నారు. ఉమ్మడి జిల్లాలోని అన్ని కోర్టుల్లోనూ లోక్ అదాలత్ ఉంటుందన్నారు. గత లోక్ అదాలత్‌లో కేసుల పరిష్కారం దృష్ట్యా రాష్ట్రంలోనే అనంతపురం జిల్లా 9వ స్థానంలో నిలిచిందని, ఈ సారి మరింత మెరుగ్గా జాతీయ లోక్ అదాలత్ నిర్వహించి ఆ స్థానాన్ని మెరుగుపరచాలన్నారు. మార్చి 8న నిర్వహించే జాతీయ లోక్‌అదాలత్‌లో 6,294 కేసులను పరిష్కారం చేయడానికి ఆయా బెంచ్‌లు కృషి చేస్తాయన్నారు. కార్యక్రమంలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి జి. శివప్రసాద్ యాదవ్ పాల్గొన్నారు.

ఇంగ్లిష్-2 పరీక్షకు 215 మంది గైర్హాజరు



ముదిగుబ్బలో పరీక్ష కేంద్రాన్ని పరిశీలిస్తున్న ధర్మవరం ఆర్డీఓ మహేష్

పుట్టపర్తి: ఇంటర్ వార్షిక పరీక్షల్లో భాగంగా బుధవారం జిల్లాలోని 42 కేంద్రాల్లో జరిగిన ఇంగ్లిష్ పేపర్-2 పరీక్షకు 215 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. జనరల్ విద్యార్థులు 9,221 మందికిగాను, 9,045 మంది హాజరయ్యారు. ఒకేషనల్ కోర్సులకు సంబంధించి 1,148 మంది విద్యార్థులకు గాను 1,109 మంది హాజరయ్యారు. మొత్తంగా 215 మంది విద్యార్థులు పరీక్షలకు గైర్హాజరైనట్లు ఇంటర్మీడియెట్ జిల్లా విద్యాశాఖాధికారి రఘునాథరెడ్డి తెలిపారు. జిల్లా స్పెషల్ ఆఫీసర్ చెన్న కేశవ ప్రసాద్, పరీక్షల నిర్వహణ కమిటీ సభ్యులు సురేష్, రామరాజు, శ్రీనివాసరెడ్డి, జిల్లా ఇన్‌చార్జ్ వెంకటేశ్వర ప్రసాద్, ఆర్డీఓలు వివిధ కేంద్రాలను తనిఖీ చేశారు.

ఆగ్రోస్ మేనేజర్లుగా ఓబుళపతి, శ్రీనివాసులు

అనంతపురం అగ్రికల్చర్: ఏపీ ఆగ్రోస్ అనంతపురం జిల్లా మేనేజర్‌గా కె.ఓబుళపతి, శ్రీసత్యసాయి జిల్లా మేనేజర్‌గా శ్రీనివాసులును నియమిస్తూ కమిషనరేట్ నుంచి ఉత్తర్వులు జారీ అయ్యాయి. ప్రస్తుతం ఓబుళపతి అనంతపురంలోని భూసార సంరక్షణ విభాగం ఏడీగా,. శ్రీనివాసులు హిందూపురంలోని భూసార సంరక్షణా విభాగం ఏడీగా పనిచేస్తున్నారు. ఇరువురూ గతంలో ఏపీ ఆగ్రోస్ మేనేజర్లుగా పనిచేసిన అనుభవం ఉండటంతో తిరిగి మరోసారి వారినే మేనేజర్లుగా నియమించినట్లు తెలిసింది. ప్రస్తుతం వ్యవసాయశాఖ పరిధిలో యాంత్రీకరణ పథకం అమలులోకి రావడంతో నోడల్ ఏజెన్సీగా ఆగ్రోస్‌కు బాధ్యతలు అప్పజెప్పడంతో ఖాళీగా ఉన్న మేనేజర్ పోస్టులను భర్తీ చేసినట్లు ఆ శాఖ వర్గాలు తెలిపాయి. ఒకట్రెండు రోజుల్లో వీరివురూ బాధ్యతలు తీసుకోనున్నట్లు సమాచారం.

ఇంటర్ సిటీ ప్యాసింజర్ రైళ్లకూ బ్రేకులు



గుంతకల్లు: హుబ్లీ-తిరుపతి మధ్య గుంతకల్లు జంక్షన్ మీదుగా తిరుగుతున్న ఇంటర్ సిటీ ప్యాసింజర్ రద్దును కూడా ఈ నెల 31 వరకు పొడిగించారు. ఈ మేరకు బుధవారం దక్షిణ మధ్య రైల్వే చీఫ్ పబ్లిక్ రిలేషన్ ఆఫీసర్ శ్రీధర్ ఆదేశాలు జారీ చేశారు. తిరుపతి-హుబ్లీ (57401) ప్యాసింజర్ ఈ నెల 30 వరకు, హుబ్లీ-తిరుపతి ప్యాసింజర్ (57402) ప్యాసింజర్ రద్దును ఈ నెల 31 వరకు పొడిగించినట్లు వివరించారు. కాగా, కుంభమేళాకు తరలించిన పలు ప్యాసింజర్ రైళ్లు ఈ నెలాఖరు వరకూ రాకపోకలు సాగించవని ఇదివరకే అధికారులు ప్రకటించారు.

పట్టా కోసం పచ్చ పన్నాగం



ఇది అనంతపురం-కదిరి జాతీయ రహదారిపై బత్తలపల్లి మండల పరిధిలోని సంజీవపురం గ్రామ సచివాలయం, రైతు భరోసా కేంద్రం వద్ద ఉన్న ప్రభుత్వ స్థలం. సెంటు ఇక్కడ కనీసంగా రూ.4 లక్షలపైనే ఉంటుంది. అర ఎకరా స్థలం ఖాళీగా ఉండగా టీడీపీ నేతలు కన్నేశారు. ఇళ్ల పట్టాల పేరుతో ఒకే సామాజిక వర్గానికి చెందిన వారు కొట్టేసేందుకు సిద్ధమయ్యారు. ఏడుగురు పట్టాలు పొందారు. మరికొందరు పచ్చ నేతలు అందే దారిలో నడుస్తున్నారు.

- ప్రభుత్వ స్థలంపై కూటమి నేతల కన్ను
- ఇళ్ల స్థలాల పేరిట రూ.లక్షల విలువైన స్థలానికి టెండర్
- ఇప్పటికే ఏడుగురికి పట్టాలు మంజూరు
- పొజిషన్ సర్టిఫికెట్ల కోసం మరికొందరు దరఖాస్తు

సాక్షి టాస్క్‌ఫోర్స్: బత్తలపల్లి మండలం సంజీవపురం గ్రామ సచివాలయం వద్ద జాతీయ రహదారికి ఆనుకుని అర ఎకరం ప్రభుత్వ భూమి ఉంది. ఈ భూమిని ఏదైనా ప్రభుత్వ భవనాల నిర్మాణాలకు ఉపయోగించుకోవాలని గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం భావించింది. ఇందుకోసం స్థలాన్ని అభివృద్ధి చేసింది. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే టీడీపీ నేతలు ఆ స్థలంపై కన్నేశారు. జిల్లాకు చెందిన ఓ మంత్రి సాయంతో ఇళ్ల పట్టాల పేరిట రూ.లక్షలు విలువ చేసే ఆ స్థలాన్ని కొట్టేసేందుకు సిద్ధమయ్యారు. ఈ క్రమంలో ఏడుగురు పొజిషన్ సర్టిఫికెట్లు పొందారు. మరికొందరు దరఖాస్తు చేసుకున్నారు. ఇక్కడ 24 మందికి రెండు సెంట్ల చొప్పున స్థలం పంపిణీ చేసేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని సమాచారం.

భూములు కోల్పోయామన్న సాకుతో...

జాతీయ రహదారి విస్తరణలో భాగంగా సంజీవపురంలోని పలువురు ఇళ్లు కోల్పోయారు. దీన్ని సాకుగా చూపి విలువైన భూమి చేజిక్కించుకునేందుకు టీడీపీ నేతలు ప్లాన్ చేశారు. ఇందులో భాగంగా మొత్తంగా 40 మంది దరఖాస్తు చేసుకున్నట్లు సమాచారం. అందులో ఏడుగురికి పొజిషన్ సర్టిఫికెట్లు మంజూరు కాగా, మరో 24 మందికి నేడో, రేపో పొజిషన్ సర్టిఫికెట్లు ఇవ్వనున్నారు. మిగిలిన వారు కూడా స్థలం కోసం పట్టుబట్టడంతో సచివాలయం సమీపంలోనే జాతీయ రహదారికి ఆనుకుని రెండు ఎకరాల్లో ఉన్న చింతవనంలో చెట్లు కొట్టేసి అక్కడ ప్లాట్లు వేసేందుకు పనులు ముమ్మరం చేశారు.

అంతా ఒకే సామాజిక వర్గం వారే..

జాతీయ రహదారి విస్తరణలో బీసీలు, ఎస్సీలు, ఎస్టీలు ఇలా పలు సామాజిక వర్గాల వారు ఇళ్లు కోల్పోయారు. కానీ ప్రస్తుతం పట్టాలు పొందిన వారు, పొందేందుకు సిద్ధంగా ఉన్న వారంతా ఒకే సామాజిక వర్గం వారు కావడంతో ఎస్సీ, బీసీ, ఎస్టీ, మైనార్టీ సామాజిక వర్గాల వారు అభ్యంతరం తెలుపుతున్నారు. ఒకే సామాజిక వర్గానికి పొజిషన్ సర్టిఫికెట్లు ఎలా ఇస్తారంటూ నిలదీస్తున్నారు. అంతేకాకుండా ఇప్పటికే గ్రామంలో రెండు ఇళ్లు, స్థలాలు ఉన్నవారికి కూడా పట్టాలు ఇస్తారా.. అని ప్రశ్నిస్తున్నారు.

కలెక్టరేట్ ఆదేశాల మేరకే..

ఈ విషయమై తహసీల్దార్ స్వర్ణలతను వివరణ కోరగా... కలెక్టరేట్ నుంచి వచ్చిన ఆదేశాల మేరకు రోడ్డు విస్తరణలో ఇళ్లు కోల్పోయిన వారికి పట్టాలు ఇచ్చామన్నారు. 16 మందికి గాను ఏడుగురు దరఖాస్తు చేసుకున్నట్లు తెలిపారు. దరఖాస్తు చేసుకున్న వారికి పట్టాలు ఇచ్చామని వివరణ ఇచ్చారు.



చింత వనంలో అక్రమంగా నిర్మాణాలు చేపడుతున్న దృశ్యం

వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శిగా 'పూల'



పూల శ్రీనివాసరెడ్డి

కదిరి: వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శిగా కదిరికి చెందిన పూల శ్రీనివాసరెడ్డి నియమితులయ్యారు. ఈ మేరకు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు పార్టీ కేంద్ర కార్యాలయం ఒక ప్రకటన విడుదల చేసింది. పూల శ్రీనివాసరెడ్డి వైఎస్సార్ సీపీ ఆవిర్భావం నుంచీ పార్టీ అభివృద్ధి కోసం పాటుపడుతున్నారు. 2014తో పాటు 2019లో జరిగిన సార్వత్రిక ఎన్నికల్లోనూ కదిరి నియోజకవర్గంలో వైఎస్సార్ సీపీ అభ్యర్థుల గెలుపునకు ఎంతో కృషి చేశారు. పార్టీ సీఈసీ సభ్యులుగా, గత సార్వత్రిక ఎన్నికల్లో పార్టీ కదిరి నియోజకవర్గ ఎన్నికల ఇన్‌చార్జ్‌గా పని చేసిన అనుభవం ఉంది. ఈ నేపథ్యంలోనే పార్టీ రాష్ట్ర కార్యదర్శిగా ఆయన్ను నియమించారు. తన సేవలను గుర్తించి పదవి కట్టబెట్టిన పార్టీ అధినేతకు, పార్టీ పెద్దలకు పూలశ్రీనివాసరెడ్డి ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ అభివృద్ధి కోసం తన శక్తి వంచన లేకుండా కష్టపడి పనిచేస్తానని, జగనన్నను మరోసారి ముఖ్యమంత్రిని చేసుకోవడమే తన లక్ష్యమని తెలిపారు.

ఐసీడీఎస్ పీడీగా శ్రీదేవి

అనంతపురం సెంట్రల్: శ్రీసత్యసాయి జిల్లా ఐసీడీఎస్ పీడీగా టి. శ్రీదేవి నియమితులయ్యారు. ప్రస్తుతం ఆమె తాడిపత్రి సీడీపీఓగా పనిచేస్తున్నారు. రాష్ట్రంలోని వివిధ జిల్లాల్లో మహిళా,శిశు సంక్షేమ శాఖ ప్రాజెక్టు డైరెక్టర్లను నియమిస్తూ ప్రభుత్వ కార్యదర్శి సూర్యకుమారి బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ క్రమంలో తాడిపత్రి సీడీపీఓగా ఉన్న టి.శ్రీదేవికి శ్రీసత్యసాయి జిల్లా పీడీగా అదనపు బాధ్యతలు (ఆన్‌డ్యూటీ) అప్పగించారు. అలాగే అనంతపురం జిల్లా ఐసీడీఎస్ పీడీగా ఎం.నాగమణిని నియమించారు. ప్రస్తుతం ఆమె కర్నూలు జిల్లా మంత్రాలయం సీడీపీఓగా పనిచేస్తుండగా, పదోన్నతి కల్పించి పీడీగా బాధ్యతలు అప్పగించారు.

నవోదయంతో నాటుసారా నిర్మూలన

- కలెక్టర్ టీఎస్ చేతన్



కళాజాతా బృందం ప్రచార రథాన్ని ప్రారంభిస్తున్న కలెక్టర్ టీఎస్ చేతన్

ప్రశాంతి నిలయం: నాటుసారా రహిత జిల్లాగా శ్రీసత్యసాయిని తీర్చిదిద్దేందుకు అందరూ సమష్టిగా పని చేయాలని కలెక్టర్ టీఎస్ చేతన్ పిలుపునిచ్చారు. ఇందుకోసం ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ ఆధ్వర్యంలో 'నవోదయం 2.0' కార్యక్రమానికి శ్రీకారం చుట్టామన్నారు. నవోదయం కార్యక్రమం ద్వారా ప్రజల్లో విస్తృతంగా అవగాహన కల్పించి నాటుసారా నిర్మూలనకు కృషి చేస్తామన్నారు. అందుకోసం ఎక్సైజ్ అధికారులు బాధ్యతాయుతంగా పని చేయాలన్నారు. 'నవోదయం 2.0' కార్యక్రమంలో భాగంగా నాటుసారా అనర్థాలను ప్రజలకు వివరించేందుకు ఏర్పాటు చేసిన కళాజాత బృందం ప్రచార రథాన్ని బుధవారం కలెక్టరేట్ ప్రాంగణంలో జెండా ఊపి కలెక్టర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... కళాజాతా బృందాలు నాటుసారా వల్ల కలిగే అనర్థాలను ప్రజలకు వివరించి చైతన్యం తేవాలన్నారు. కార్యక్రమంలో అధికారులందరూ పాల్గొనాలని ఆదేశించారు. గ్రామ, పట్టణ, డివిజన్ స్థాయిల్లో అవగాహన సదస్సులు, ప్రచార కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. నాటుసారా వినియోగం వల్ల కలిగే నష్టాలు, ఆరోగ్య ఇబ్బందులు, సామాజిక, ఆర్థిక సమస్యలపై ప్రజలు కూడా అవగాహన పెంచుకోవాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో ఎక్సైజ్ శాఖ అధికారులు పాల్గొన్నారు.

సమష్టి కృషితోనే మహిళాభ్యుదయం



పట్టణంలో ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం (ఇన్‌సెట్) మాట్లాడుతున్న ఎస్పీ రత్న

కదిరి అర్బన్: సమష్టి కృషితోనే మహిళాభ్యుదయం సాధ్యమవుతుందని ఎస్పీ రత్న అన్నారు. ప్రస్తుతం పురుషులతో సమానంగా అన్ని రంగాల్లో మహిళలు రాణిస్తున్నప్పటికీ, మహిళల హక్కులను కాపాడాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. స్థానిక జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో బుధవారం అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. తొలుత మున్సిపల్ కార్యాలయం నుంచి వందలాది మంది మహిళలు ర్యాలీగా జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలకు చేరుకున్నారు. అనంతరం నిర్వహించిన సమావేశంలో ఎస్పీ వి.రత్న, ఆర్డీఓ వీవీఎస్ శర్మ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ... మారుతున్న కాలానికి అనుగుణంగా మహిళలు కూడా మారాలన్నారు. మహిళలకు వ్యక్తిగత స్వేచ్ఛ చాలా ముఖ్యమన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక ప్రదర్శనలు అందరినీ అలరించాయి. కార్యక్రమంలో సీఐలు నారాయణరెడ్డి, ఎంపీడీఓ పోలప్ప, సీడీపీఓ రాధిక, రెడ్స్ సంస్థ అధ్యక్షురాలు భానూజా పాల్గొన్నారు.

రీ సర్వే పక్కాగా చేయాలి

- అధికారులకు జాయింట్ కలెక్టర్ అభిషేక్‌కుమార్ ఆదేశం



కొండూరులో రాగి పంటను పరిశీలిస్తున్న జేసీ అభిషేక్ కుమార్

లేపాక్షి: భూవివాదాలను పరిష్కరించేందుకు ప్రభుత్వం చేపట్టిన రీ సర్వే పక్కాగా చేయాలని జాయింట్ కలెక్టర్ అభిషేక్‌కుమార్ అధికారులను ఆదేశించారు. బుధవారం ఆయన మండలంలోని మానేపల్లి గ్రామంలో జరుగుతున్న రీ సర్వేను పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ.. భూముల రీ సర్వే వల్ల అటు రైతులకు, ఇటు ప్రభుత్వానికి మేలు జరుగుతుందన్నారు. అలాగే భూ తగాదాలను శాశ్వత పరిష్కారం చూపవచ్చన్నారు. అనంతరం అక్కడికి వచ్చిన రైతులతో, సర్వేయర్‌తో మాట్లాడి రీ సర్వేలో ఉత్పన్నమైన సమస్యలు, గ్రౌండ్ వాలిడేషన్ వివరాలను అడిగి తెలుసుకున్నారు. జేసీ వెంట తహసీల్దార్ సౌజన్యలక్ష్మి, ఏడీఏ అల్తాఫ్ అలీఖాన్, ఏఓ శ్రీలత, రెవెన్యూ, వ్యవసాయ సిబ్బంది ఉన్నారు.

ఈ-క్రాప్ సూపర్ చెక్..

ఈ-క్రాప్ సూపర్ చెక్‌లో భాగంగా జేసీ అభిషేక్ కుమార్ కొండూరు గ్రామ రైతులు నందిని, ఈడిగ వెంకటరమణప్ప సాగు చేసిన రాగిపంటను, లేపాక్షి గ్రామానికి చెందిన ఆదినారాయణరెడ్డి సాగుచేసిన మొక్కజొన్న పంటను పరిశీలించారు. రైతులతో ఈ-క్రాప్ బుకింగ్ విధానం, పంట దిగుబడి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఆన్‌లైన్‌లో నమోదు చేసిన విస్తీర్ణం, పంట వివరాలను పరిశీలించారు.

తహసీల్దార్ కార్యాలయం తనిఖీ..

లేపాక్షి తహసీల్దార్ కార్యాలయాన్ని జాయింట్ కలెక్టర్ అభిషేక్‌కుమార్ బుధవారం తనిఖీ చేశారు. వివిధ పనుల నిమిత్తం కార్యాలయానికి వచ్చిన అర్జీదారులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. కార్యాలయ సిబ్బంది పనితీరుపై ఆరా తీశారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయ సిబ్బంది, వీఆర్‌ఓలతో సమావేశమయ్యారు. ప్రభుత్వ ప్రాధాన్యత కార్యక్రమాలైన అందరికీ ఇళ్లు, ఇళ్ల పట్టాల క్రమబద్ధీకరణ, పొజిషన్ సర్టిఫికెట్, ఫ్రీ హోల్డ్ వెరిఫికేషన్, భూ కేటాయింపు పరిశీలన తదితర అంశాలపై తగు సూచనలు ఇచ్చారు.

ఆక్రమిత భూములపై ఆర్డీఓ విచారణ

- గ్రామ సభలు నిర్వహించి అర్హులకు న్యాయం చేస్తామని వెల్లడి



బాధిత రైతులతో మాట్లాడుతున్న ఆర్డీఓ

ముదిగుబ్బ: మండల పరిధిలోని ఏబీపల్లి తండాలో ధర్మవరం ఆర్డీఓ మహేష్ బుధవారం విచారణ చేపట్టారు. ఎంపీపీ ఆదినారాయణ యాదవ్ గిరిజనుల భూములను ఆక్రమించి తమ బంధువుల పేరుతో ఆన్‌లైన్‌లో ఎక్కించుకుని బ్యాంకుల్లో పంట రుణాలు తీసుకున్నారని బాధితులు ఆరోపిస్తుండగా... మంగళవారం సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ ఏబీపల్లి తండాలో పర్యటించి బాధితులతో మాట్లాడిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో బుధవారం ఆర్డీఓ మహేష్, తహసీల్దార్ నారాయణస్వామి, సర్వేయర్ శివకుమార్ నాయక్ ఏబీపల్లి తండాలో పర్యటించారు. సర్వే నంబర్ 1858, 1962, 1963, 1809లలోని భూములను ఆర్డీఓ స్వయంగా పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులు రవిశంకర్ నాయక్, గాయత్రిబాయి, నారాయణమ్మ, జయమ్మ, కుల్లాయప్ప నాయక్, బాలునాయక్‌లు తదితరులు ఆర్డీఓ ఎదుట తమ గోడు వెళ్లబోసుకున్నారు. ఎంపీపీ ఆదినారాయణ యాదవ్ తమ భూములను ఆన్‌లైన్‌లో ఇతర పేర్లపై ఎక్కించాడని, ఆ పత్రాలతో బ్యాంకుల్లో రుణాలు కూడా తీసుకున్నాడని వాపోయారు. తమ వద్ద భూములకు సంబంధించిన అన్ని ఆధారాలు ఉన్నాయని తెలిపారు. స్పందించిన ఆర్డీఓ... గ్రామస్తులు, పెద్దల సమక్షంలో గ్రామసభ నిర్వహించి రైతులకు న్యాయం జరిగేలా చేస్తామని హామీ ఇచ్చారు. వెంటనే గ్రామ సభల నిర్వహణకు ఏర్పాట్లు చేయాలని తహసీల్దార్‌ను ఆదేశించారు.

స్టోర్ డీలర్‌పై టీడీపీ నేత దాడి

- బియ్యం వేయకూడదని హుకుం



బాధిత స్టోర్ డీలర్ ఆదినారాయణ

హిందూపురం: తాము హెచ్చరించినా రేషన్ దుకాణం వదులుకోలేదన్న కోపంతో టీడీపీ నాయకుడు అంజినప్ప దళిత సామాజిక వర్గానికి చెందిన ఓ రేషన్ షాపు డీలర్‌పై దాడి చేశాడు. ఈ ఘటన బుధవారం హిందూపురం మండలం కగ్గల్లు గ్రామంలో చోటుచేసుకుంది. బాధితుడు తెలిపిన వివరాల మేరకు... దళిత సామాజిక వర్గానికి చెందిన ఆదినారాయణ దివ్యాంగుడు. 2006 నుంచి గ్రామ (ఎఫ్‌పీ షాప్‌నంబర్ 1257060) డీలర్‌గా పనిచేసూత్ జీవనం సాగిస్తున్నాడు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టగానే డీలర్ షిప్ వదులుకోవాలని టీడీపీ నేతలు ఆదినారాయణను బెదిరించారు. దీని గురించి గ్రామ సర్పంచ్ హనుమంతు రాయప్పకు బాధితుడు చెప్పుకోగా.. సర్పంచ్ కూడా టీడీపీ నేతలకే వత్తాసు పలుకుతూ రేషన్ డీలర్ షిప్ వదులుకోవాలని బెదిరించాడు. దీంతో ఆదినారాయణ తప్పనిసరి పరిస్థితిలో కోర్టును ఆశ్రయించి డీలర్‌గా కొనసాగేలా అనుమతులు తెచ్చుకున్నాడు. దీంతో రెవెన్యూ అధికారులు ఆదినారాయణ ఎఫ్‌సీ షాపునకు నెలసరి రేషన్ బియ్యం కోటాను మంజూరు చేశారు. ఈ క్రమంలో ఆదినారాయణ బుధవారం బియ్యం బస్తాలను లారీ నుంచి దించుకుంటుండగా.. టీడీపీ నాయకుడు అంజినప్ప అక్కడికి వచ్చి పరుష పదజాలంతో దూషించాడు. అంతేకాకుండా భౌతికదాడి చేయడంతో పాటు అందరి ముందు చెప్పుకాలితో తన్నాడు. తనకు కోర్టు అనుమతి ఉందని ఆదినారాయణ చెబుతున్నా 'ప్రభుత్వం మాది... మాదే జరుగుతుంది... కోర్టు గీర్టు జాన్తా నై.. నీ ఇష్టం వచ్చిన వాడికి చెప్పుకో'' అంటూ అందరి ముందు దుషించాడు. దీనిపై బాధితుడు బుధవారం హిందూపురం రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. అంజినప్పపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులో పేర్కొన్నారు.

హంద్రీ-నీవాకు లైనింగ్ వద్దు

- కాలువ వెడల్పుకు చర్యలు తీసుకోవాలి
- ఉమ్మడి అనంతపురం జిల్లా జలసాధన సమితి డిమాండ్



లైనింగ్ పనులు నిలిపివేయాలని జానకంపల్లి వద్ద హంద్రీనీవా కాలువలో దిగి నిరసన తెలుపుతున్న జలసాధన సమితి నేతలు

పుట్టపర్తి: హంద్రీ-నీవా కాలువకు సిమెంట్ లైనింగ్ పనులు వెంటనే రద్దు చేయాలని ఉమ్మడి అనంతపురం జిల్లా జలసాధన సమితి నాయకులు డిమాండ్ చేశారు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో కాలువ వెడల్పు కోసం ఇచ్చిన అనుమతుల మేరకు పనులు చేయాలని కోరారు. బుధవారం ఉమ్మడి అనంతపురం జిల్లా జలసాధన సమితి ప్రధాన కార్యదర్శి వాటర్‌షెడ్ గంగిరెడ్డి, ఓపీడీఆర్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్రీనివాసులు, సభ్యులు నవీన్, జలీల్, రైతు కూలీ సంఘం నేత ఖాసీమ్, రైతులు ప్రభాకర్‌రెడ్డి తదితరులు బుక్కపట్నం మండలం జానకంపల్లి వద్ద హంద్రీ-నీవా కాలువ సిమెంట్ లైనింగ్ పనులకు భూమి పూజ చేసిన చోట ఆందోళన చేపట్టారు. హంద్రీ-నీవా కాలువ సిమెంట్ లైనింగ్ పనుల కోసం కూటమి ప్రభుత్వం జారీ చేసిన 404, 405 జీఓలను వెంటనే రద్దు చేయాలని, ప్రధాన కాలువ సామర్థ్యాన్ని 10 క్యూసెక్కులకు పెంచాలని డిమాండ్ చేశారు. అనంతరం వారు విలేకరులతో మాట్లాడారు.

లైనింగ్‌తో తీరని నష్టం..

గత ఆరేళ్లుగా హంద్రీ-నీవా కాలువలో ఏడాదిలో ఆరు నెలలు నీరు ప్రవహిస్తుండగా.. భూగర్భ జలమట్టం పెరిగి బోరు బావుల్లో నీరు పుష్కలంగా ఉండేదని జలసాధన సమితి నేతలు గుర్తు చేశారు. తద్వారా రైతులు పంటలు పండించుకుంటూ హాయిగా ఉన్నారన్నారు. తాజాగా కూటమి ప్రభుత్వం చేపట్టిన సిమెంట్ లైనింగ్‌తో భూ గర్భ జలాలు హరించుకుపోతాయని, బోర్లు ఒట్టిపోయి రైతులను తీరని నష్టం జరుగుతుందన్నారు. లైనింగ్ పనులు ఆపకపోతే ఉమ్మడి అనంతపురం జిల్లా మళ్లీ కరువుకోరల్లో చిక్కుకుంటుందని వారు ఆందోళన వ్యక్తం చేశారు.

కాలువ వెడల్పుతో రైతులకు మేలు..

ఉమ్మడి అనంతపురం జిల్లా రైతుల సాగునీటి కష్టాలు చూసిన నాటి ముఖ్యమంత్రి వైఎస్సార్ హంద్రీ-నీవాకు కాలువ పనులు పూర్తి చేశారని జలసాధన సమితి నేతలు గుర్తు చేశారు. 2014లోనే జీడిపల్లి వరకు కృష్ణా జలాలను తీసుకొచ్చారని, 2017 నుంచి శ్రీసత్యసాయి జిల్లాకు హంద్రీ-నీవా ద్వారా సాగునీరు అందుతోందన్నారు. అయితే కాలువ వెడల్పు లేకపోవడంతో తగినంత నీరు తీసుకోలేకపోతున్నామన్నారు. ఈ క్రమంలోనే హంద్రీ-నీవా కాలువను వెడల్పు చేసేందుకు సిద్ధమైందన్నారు. మొత్తంగా 6,300 క్యూసెక్కుల కృష్ణాజలాలను తీసుకునేందుకు వైఎస్ జగన్ సర్కార్ 2021లో కాలువ వెడల్పు పనులకు రూ.6,182 కోట్లకు అనుమతులు మంజూరు చేసిందని జలసాధన సమితి నేతలు గుర్తు చేశారు. ఈ మేరకు పనులు చేపడితో రైతులకు ఎంతో ప్రయోజనం చేకూరుతుందన్నారు. కూటమి ప్రభుత్వం ఇప్పటికైనా అనంత రైతన్న ఆవేదనను అర్థం చేసుకుని లైనింగ్ పనులు నిలిపివేసి హంద్రీ-నీవా కాలువ వెడల్పు పనులు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు.